సాక్షి ఒడిశా

ఆదివారం, 7, జూలై, 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.3,90,987

వెండి : 31 గ్రాముల 850 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరి



మళ్లీ వాయిదా..!

పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచే విషయం మరోసారి వాయిదా పడింది.

- 8లో



మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లను యజమానులకు అప్పగిస్తున్న పోలీసులు

కొరాపుట్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి వాటి యజమానులకు పోలీసులు అప్పగించారు. ఈ మేరకు శనివారం కొరాపుట్ జిల్లా సునాబెడా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌డీపీవో మనబ్రత సత్పతి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రదేశాల్లో అనేక కారణాలు వలన ఫోన్లు పోగొట్టుకున్న వారి ఫిర్యాదులు ఆధారంగా సాంకేతిక పద్ధతిలో వాటిని తిరిగి స్వాధీనం చేసుకున్నామన్నారు. దమంజోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 సెల్‌ఫోన్లు, పొట్టంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, సిమిలిగుడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని మీడియా సమక్షంలో యజమానులకు అప్పగించారు. కార్యక్రమంలో దమంజోడి ఐఐసీ ప్రమయ బిడ్డిక, సునాబెడా ఐఐసీ సత్యానంద, పొట్టంగి ఐఐసీ చతుర్భుజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కిరండోల్ పాసింజర్ రద్దు



విశాఖపట్నం–కిరండోల్ పాసింజర్ రైలు

కొరాపుట్: విశాఖపట్నం–కిరండోల్ పాసింజర్ రైలు తాత్కాలికంగా రద్దు చేశారు. ఈనెల 8వ తేదీన 08551 నంబర్‌తో నడిచే విశాఖపట్నం–కిరండోల్ పాసింజర్ రైలు, 9వ తేదీన 08552 నంబర్‌తో నడిచే కిరండోల్–విశాఖపట్నం పాసింజర్ రైళ్ల సర్వీసులు రద్దు చేస్తున్నట్టు రైల్వే వర్గాలు ప్రకటించాయి. ఈ రైలు కిరండోల్, జగదల్‌పూర్, జయపూర్, కొరాపుట్, అరకు, కొత్తవలసల మీదుగా విశాఖ చేరుకుంటుంది. ప్రతిరోజూ ఉదయం విశాఖ నుంచి ఒకటి, కిరండోల్ నుంచి మరొకటి ప్రయాణం ప్రారంభిస్తాయి. ఈ రైలుకి కేంద్ర పర్యాటక శాఖ సహకారంతో విస్టాడోం కోచ్ ఉంది. అరకు, కొరాపుట్ అటవీ అందాలు పగటి పూట చూడడానికి పర్యాటకులు ఈ రైలుపైనే ఆధారపడుతుంటారు. కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో పలుచోట్ల వంతెనలు, ట్రాక్‌లు మరమ్మతులు చేయడానికి తాత్కాలికంగా రద్దు చేశారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

- పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం



ఐటీడీఏ అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే రాం ఖడం

కొరాపుట్: గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం తెలియజేశారు. ఈ మేరకు ఐటీడీఏ అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. కొరియాలో స్ట్రాబెర్రీ సాగు జరుగుతోందని, అందువలన ఆ పంట ఉత్పత్తి పెంచడానికి, మార్కెటింగ్ అవకాశాలు పెండడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొరియాలో విద్యాలయాలు ఏర్పాటు చేశామని, అలాగే వారికి ఉపాధి అవకాశాలు పెంచడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనులు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఊతమిస్తామన్నారు. ఆదివాసీలకు ఉపాధి అవకాశాలు పెంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తపన్ కుమార్ నాయక్, లైవ్లీహుడ్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ మహంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కెనాల్ నీటి విడుదల

జయపురం: ఖరీఫ్ పంటలకు సంబంధించి అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు సాగునీటిని కెనాల్ నుంచి ఆదివారం వదులుతున్నట్లు సాగునీటి ప్రాజెక్టు ఎస్‌డీవో శంభుప్రసాద్ సాహు శనివారం వెల్లడించారు. రబీ పంటలు పూర్తైన తర్వాత కెనాల్‌లో నీరు నిలుపుదల చేశారు. జయంతిగిరి సమీప కెనాల్ నేషనల్ హైవే వంతెన మరమ్మతుల పనులు జరుగుతుండడం వలన ఖరీఫ్ పంటకు సాగునీరు విడిచిపెట్టడం ఆలస్యమైందని వెల్లడించారు. జయపురం సబ్ డివిజన్‌లోని జయపురం సమితి, బొరిగుమ్మ సమితి, కొట్‌పాడ్ సమితి, కుంద్ర సమితుల్లోని 42,456 హెక్టార్ల పంట భూములకు సాగునీరు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ఇంకా.. తెలవారదేమీ..!



శ్రీమందిరం ఆవరణలో మూడు రథాలు

ఏడాదంతా ఎదురుచూసిన సమయం రానే వచ్చింది. భక్తుల తన్మయత్వం నడుమ శ్రీజగన్నాథుడి రథయాత్ర ఆదివారం నుంచి ప్రారంభమవ్వనుంది. ఆ ఘడియల కోసం భక్తజనం ఒళ్లంతా కళ్లు చేసుకొని ఎదురుచూస్తున్నారు. స్వామివారి ఆగమనం కోసం రథాలు సిద్ధమయ్యాయి. చతుర్ధా మూర్తుల రాకకు గుండిచా మందిరం ముందుగానే ముస్తాబై ముచ్చటపడుతోంది. ఈ నవ దినాత్మక విశ్వ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసింది.

– భువనేశ్వర్



దక్షిణ మలుపు తిరుగుతున్న శ్రీజగన్నాథుని నందిఘోష్ రథం

- నేడు పూరీ జగన్నాథుడి వార్షిక రథయాత్ర
- రెండు రోజుల పాటు కొనసాగనున్న యాత్ర
- సాయంత్రం 5 గంటలకు ప్రారంభం



శ్రీమందిరం వాకిటకు చేరుతున్న బలభద్రుని తాళధ్వజం

భక్త జనులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్న రథయాత్ర రానే వచ్చింది. తయారీ ప్రాంగణం నుంచి 3 కొత్త రథాలు శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు శనివారం సాయంత్రం చేరాయి. ఈ రథాలు స్వామివారి ఆగమనం కోసం ఎదురు చూస్తున్నాయి. మరోవైపు నిర్ధారిత వేళల ప్రకారం సకాలంలో ఉత్సవ సేవాదులు సకాలంలో పూర్తి చేయాలని సేవాయత్, అధికార యంతాంగాలు యుద్ధ ప్రాతిపదిక పని చేస్తున్నాయి. శ్రీమందిరం నుంచి గుండిచా మందిరం వరకు బొడొదండొ దారి పొడవునా యాత్ర సందడి అలముకుంది. గుండిచా మందిరంలో అడపా మండపంపై మూల విరాటులు ఆసీనులై నవ దినాత్మక యాత్ర దర్శనం ప్రసాదిస్తారు.

యాత్ర ఆలస్యం

జ్యేష్ఠ పూర్ణిమ మర్నాటి నుంచి స్వామివారిని కనులారా తిలకించేందుకు భక్త జనం ఉవ్విళూరుతున్నారు. ఈసారి శ్రీ జగన్నాథుని రథయాత్ర అద్వితీయం. సుమారు 53 ఏళ్ల తర్వాత స్వామివారి అద్వితీయమైన రథోత్సవం ఆదివారం జరుగుతుంది. నేత్రోత్సవం, నవ యవ్వనం, శ్రీ గుండిచా యాత్ర ఒకే రోజున జరుగుతుండడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు స్వామివారి నేత్రోత్సవం, నవ యవ్వన దర్శనం దూరం అయింది. మూడు మహోత్సవాలను ఒకే రోజున నిర్వహించాల్సి రావడంతో రథయాత్ర ఆరంభం ఆలస్యం అవుతుంది. దీని ప్రభావంతో ఈసారి రథయాత్ర వరుసగా రెండు రోజులు కొనసాగుతుంది. ఇది భక్తులకు అరుదుగా కలిసి వచ్చిన అవకాశం. ఈ నెల 7 మరియు 8 తేదీలు ఆది, సోమవారాల్లో వరుసగా రెండు రోజులు రథాలు లాగి గుండిచా గమ్యం చేర్చుతారు.

శ్రీమందిరం వాకిట రథాలు

శ్రీమందిరం వాకిట 3 రథాలు మూల విరాటుల రాక కోసం నిరీక్షిస్తున్నాయి. ఈసారి యాత్ర విభిన్నం కావడంతో తయారీ ప్రాంగణం నుంచి యాత్ర కోసం 3 రథాలను శ్రీ మందిరం సింహద్వారం ఆవరణకు లాగేందుకు మూల విరాటుల బదులుగా పట్టా చిత్ర దేవుళ్ల నుంచి ఆజ్ఞామాలలతో రథాల మలుపు తిప్పడం ప్రారంభించారు. సంప్రదాయం ప్రకారం శనివారం సుప్రభాత ధూపదీప సేవాదులు ముగిశాక పూజాపండా సేవాయత్‌లు ఘంటానాదం మధ్య మూడు ఆజ్ఞామాలలతో రథ తయారీ ప్రాంగణానికి చేరారు. తొలుత బలభద్రుని తాళ ధ్వజానికి ఆజ్ఞామాలతో పూజించారు. తర్వాత వరుసగా మహాప్రభు శ్రీజగన్నాథుని నందిఘోష్, దేవీ సుభద్ర రథం దర్పదళనం రథానికి ఆజ్ఞామాలలతో పూజించి వరుస క్రమంలో సంప్రదాయ రీతిలో 3 రథాలను దక్షిణం వైపు మలుపు తిప్పి శ్రీ మందిరం ఆవరణకు చేర్చారు. ఈ క్రమంలో తొలుత శ్రీ జగన్నాథుని నందిఘోష్ తదుపరి దేవీ సుభద్ర దర్ప దళనం, చివరగా బలభద్ర స్వామి తాళ ధ్వజం మలుపు తిప్పారు. పోలీసు బలగాలు, సేవకులు, భక్తులు అత్యంత ఉత్సాహంతో 3 రథాల్ని సురక్షితంగా శ్రీ మందిరం సింహద్వారం ఆవరణకు తీసుకొచ్చారు.

శ్రీ జగన్నాథుని రథం వివరాలు	
పేర్లు: నందిఘోష్, చక్రధ్వజం, గరుడ ధ్వజం	
ఎత్తు	45 అడుగుల 6 అంగుళాలు
చక్రాలు	16
రథ సంరక్షకుడు	గరుడ
సారథి	దారుకా
తాడు	శంఖచూడ
పతాకం	త్రైలోక్య మోహిని
ఆయుధాలు	శంఖం, చక్రాలు
గుర్రాలు	నాలుగు(శంఖ, బలాహక, శ్వేత, హరదశ్వ)

పటిష్ట భద్రత

ఈ ఏడాది రెండు రోజులపాటు జరగనున్న రథ యాత్రకు విశేష సంఖ్యలో యాత్రికులు తరలి వస్తారని అంచనా. ఈ సందర్భంగా పూరీ పట్టణ వ్యాప్తంగా, ప్రధానంగా యాత్ర పరిసరాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కార్యకలాపాల కోసం 180 ప్లాటూన్ పోలీసు బలగాలను మోహరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిరోజు రథ యాత్ర ప్రత్యక్షంగా తిలకించనున్నారు.

రథయాత్ర వేళలు

శనివారం అర్ధరాత్రి 2 గంటలకు ద్వారాలు తెరుస్తారు. 2.40 గంటలకు దశావతారమూర్తుల బహుడా విజే, వేకువజాము 3 గంటలకు పట్టా చిత్రాలు తొలగిస్తారు. ఉదయం 4 గంటలకు నేత్రోత్సవం ప్రారంభిస్తారు. 4.45 గంటలకు యాత్రాంగి స్నానం ముగించి 6 నుంచి 7 గంటల మధ్య గోపాల్ వల్లభ సేవ నిర్వహిస్తారు. అనంతరం 7.30 గంటల నుంచి రథయాత్ర సన్నాహాలు ఆరంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలు సరికి సేనా పట్టా అమరిక ముగిస్తారు. మరో వైపు శ్రీ మందిరం బయట ఉదయం 11 గంటలకు రథ ప్రతిష్ఠ కార్యక్రమం ఖరారు చేశారు. మూల విరాటులకు మంగళ హారతి సమర్పించి మధ్యాహ్నం 1.10 గంటల నుంచి 2.30 గంటల మధ్య మూల విరాటులను రథాలపైకి తరలించే గొట్టి పాహండి కార్యక్రమం చేపడతారు. మధ్యాహ్నం 3 గంటలకు మదన్ మోహన్, రామకృష్ణ విజే, సాయంత్రం 4 గంటలకు పూరీ గజపతి మహా రాజా ఛెరా పాంహరా సేవలో పాల్గొంటారు. అనంతరం రథాలకు అమర్చిన చారుమళ్ల (తాటి మట్ట మెట్లు) తొలగించి రథాలకు సారథులు, కొయ్య గుర్రాలను అమర్చుతారు. ఈ కార్యక్రమం ముగియడంతో సాయంత్రం 5 గంటలకు రథాలు లాగడం ప్రారంభిస్తారు. తొలుత బలభద్ర స్వామి తాళ ధ్వజం కదులుతుంది. వెంబడి దేవీ సుభద్ర రథం దర్ప దళనం, చివరగా శ్రీజగన్నాథుని నంది ఘోష్ రథం కదలడం ఆచారం.



నందిఘోష్ రథం గుర్రాలు



రథాలు మలుపు తిప్పేందుకు ఆజ్ఞామాల తరలిస్తున్న పూజా పండా సేవకులు



ముస్తాబైన గుండిచా మందిరం



నందిఘోష్ రథానికి ఆజ్ఞామాలతో పూజ

అంబులెన్స్ ఢీకొని కొడుకు మృతి



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

- తండ్రి పరిస్థితి విషమం

కొరాపుట్: అంబులెన్స్ ఢీకొనడంతో కొడుకు మృతి చెందగా, తండ్రి తీవ్రగాయాలతో విషమ పరిస్థితిలో ఉన్న ఘటన నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం సమితి మెహింద్రి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన గణేష్ మహంతి, తన కుమారుడు నిఖిల్ మహంతి (8)తో సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనక నుంచి అంబులెన్స్ వేగంగా వచ్చి వీరిని ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలోనే నిఖిల్ మృతి చెందగా, గణేష్ తీవ్రగాయాలు పాలయ్యాడు. వెంటనే స్థానికులు గణేష్‌ని డాబుగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ డాబుగాం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో నబరంగ్‌పూర్–ఉమ్మర్‌కోట్ పట్టణాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్

హామీలు నెరవేర్చేందుకు సిద్ధమవ్వాలి

- సీఎం మోహన్ చరణ్ మాఝీ ఆదేశాలు

భువనేశ్వర్: ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు బ్లూ ప్రింట్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదేశించారు. కార్యదర్శులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో అధికారుల సహకారాన్ని కోరారు. తమ ప్రభుత్వం 24 గంటలూ ప్రజలకు జవాబుదారీగా ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజలతోనే ఉండాలనే నిబద్ధతతో పని చేస్తున్నామని వెల్లడించారు. 21 ప్రధాన ఎన్నికల హామీల అమలుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒడిశా కోసం విజన్–2036ని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గత 24 ఏళ్లలో పాత ప్రభుత్వం చేయలేనిది ఈ 5 ఏళ్లలో చేసి చూపించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను విచారించే ప్రక్రియను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలతో మమేకమైతే ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఎలాంటి మధ్యవర్తులు ఉండకూడదని హితవు పలికారు.

ఒడియా భాషకు ప్రాధాన్యం

ఒడియా అస్మిత (ఆత్మ గౌరవం) అంశాన్ని లేవనెత్తిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ ప్రతీ శాఖ కార్యక్రమం ఒడియా భాషలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రజాకర్షిత పథకాలు మరియు రాష్ట్ర ప్రభుత్వం యొక్క అన్ని పథకాలను విజయవంతంగా అమలు చేయడంపై ఉద్ఘాటించారు. ఈ పథకాలను సజావుగా, సమర్ధవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో, క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. ఒడిశా అభివృద్ధికి పని చేసేందుకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. కానీ వారు పారదర్శకత మరియు జవాబుదారీతనం సరిహద్దులలో పనిచేయాలని స్పష్టం చేశారు. హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్ మొత్తాన్ని చర్చించాలని, అన్ని అంశాల ప్రస్తుత స్థితిగతులపై నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులతో పాటు మంత్రివర్గంలోని సభ్యులందరూ ప్రభుత్వంలో కీలక పాత్రధారులే అన్నారు. నిర్ణయం తీసుకునే ప్రక్రియలో అందరి భాగస్వామ్యమే తమ ప్రాధాన్యత అన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, ముఖ్యమంత్రి అదనపు ముఖ్య కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలా, అదనపు ముఖ్య కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

• ఎమ్మెల్యే నీలమాధవ హికక



రైతు సహాయక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హికక

రాయగడ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేయాలని ఎమ్మెల్యే నీలమాధవ హికక సూచించారు. జిల్లాలోని మునిగుడ సమితి తెలంగాపాదొరొలో రైతు సహాయక కేంద్రం శనివారం ప్రారంభమయ్యింది. బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే నీలమాధవ హికక ముఖ్య అతిథిగా హాజరై కేంద్రం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను అందించడంతో పాటు వారికి తగిన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు అందించగలిగితే, వారు ఎంతో అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. రైతుకు అన్నివిధాల సహకారం అందించినప్పుడే దేశంలో వ్యవసాయ రంగం ఉన్నతంగా ఉంటున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖకు చెందిన గోదాధర్ మిశ్రో, ఉత్తమ్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అంకిత్ వర్మ

జయపురం: స్థానిక మహారాణిపేట శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసి, అతడి నుండి పలు సామాన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత్ కుమార్ వర్మ వెల్లడించారు. శనివారం సబ్ డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక మందిరంలో ఫిబ్రవరి 3వ తేదీన జరిగిన దొంగతనం కేసులో ఘన శ్యామ్‌ను అరెస్టు చేశామన్నారు. నిందితుడు తన 18 ఏళ్ల వయస్సు నుంచి వివిధ మందిరాల్లో దొంగతనాలు చేయడం ప్రారంభించాడని వెల్లడించారు. అతడు ఆంధ్రప్రదేశ్‌లో 24, కర్నాటకలో 9, ఒడిశాలో 14 దొంగతనాలు చేసినట్లు తెలిసిందన్నారు. మందిరంలో దొంగలించిన వెండి వస్తువులు, బంగారు వస్తువులు అమ్మిన డబ్బు రూ.2 లక్షలను నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసి ఆలయ కమిటీకి అందజేశామన్నారు. అదేవిధంగా రాయగడ సాయి మందిరంలో 2024 ఫిబ్రవరి 12వ తేదీన జరిగిన దొంగతనం ఇతడే చేశాడని తెలియజేశారు.

రైలు ఢీకొని ఆవు మృతి

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం రాజారాణీ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఆవు మృతిచెందింది. గుణుపూర్ నుంచి నౌపడ వైపు వెళ్లే రాజారాణి ఎక్స్‌ప్రెస్ టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి పక్కన మేత మేస్తున్న ఆవు ఒక్కసారిగా పరుగు తీసి రైలు కిందకు దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న లోకో పైలట్ రైలును కొంత సమయం ఆపి ఆవు కళేబరాన్ని బయటకుతీసే ప్రయత్నం చేశారు అయిన ఫలితం లేకపోవడంతో రైలు అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆవు యజమాని వివరాలు తెలియలేదు.

గెడ్డలో జారిపడి..

వజ్రపుకొత్తూరు: మండలంలోని అనంతగిరి గ్రామంలో పాడి రైతు బదకల ప్రకాష్‌కు చెందిన పాడి ఆవు శనివారం మృతి చెందింది. గెడ్డ గట్టుపై నుంచి జారిపడిపోవడంతో నీరు తాగి అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవలే రూ.70 వేలకు ఈ ఆవును కొనుగోలు చేశారు. మృతి చెందిన విషయాన్ని వజ్రపుకొత్తూరు పశువైద్యాధికారి ఎం.పాపారావు దృష్టికి తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరు గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అరసవల్లి శంకరరావు(30) శనివారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. శంకరావు గ్రామంలో కర్రపని చేసేవాడు. పని నిమిత్తం తన ద్విచక్రవాహనం పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా టెక్కలి మండలం కె.కొత్తూరు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తూరు: మండలంలోని డెప్పిగూడ గిరిజన గ్రామం సమీపంలో శనివారం సెబ్ ఎస్ఐ శ్రావణి, పలాస్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

మళ్లీ వాయిదా..!

• రత్న భాండాగారం తెరవడంపై కమిటీ సమావేశం
• తేదీ ప్రకటనకు మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయం
• జూలై 9న తదుపరి సమావేశం



మీడియాతో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు జస్టిస్ బిస్వనాథ్ రథ్

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచే విషయం మరోసారి వాయిదా పడింది. ఈ విషయమై ప్రభుత్వం నియమించిన కొత్త కమిటీ శనివారం శ్రీ జగన్నాథ ఆలయం సమావేశం హాల్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. అనంతరం రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు జస్టిస్ బిస్వనాథ్ రథ్ మీడియాతో స్పందించారు. రత్న భాండాగారం తెరిచే తేదీ తదుపరి సమావేశంలో నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అత్యున్నత స్థాయి కమిటీ జూలై 9న మరోసారి సమావేశం కానుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ జగన్నాథ ఆలయంలో రత్న భాండాగారం తెరవడంపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు.

కీలక అంశాలపై చర్చ

దశాబ్దాలుగా తెరవని శ్రీజగన్నాథ రత్న భాండాగారం తెరవడంపై పలు కీలక అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. ప్రధానంగా తాళం చెవి వ్యవహారం చర్చకు వచ్చినట్లు పేర్కొన్నారు. అధికారవర్గాలతో అందుబాటులో ఉన్న నకిలీ తాళం చెవిలు తదుపరి సమావేశంలో ప్రవేశపెడతారు. ఈ వ్యవహారాన్ని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఆ తాళం చెవితో రత్న భాండాగారం తెరిచి అనుబంధ ప్రక్రియ వేగిరపరిచేందుకు చర్యలు చేపడతారు. దీర్ఘకాలంగా రత్న భాండాగారం తాళం తెరవనందున తాళం జంగు పట్టడం వంటి అనివార్య పరిస్థితుల ప్రభావంతో, నకిలీ తాళం చెవితో తెరవలేని పరిస్థితుల్లో రత్న భాండాగారం తాళం విరగ్గొట్టడం జరుగుతుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోసం ముందస్తుగా అభ్యర్థిస్తారు. తాళం విరగ్గొట్టాల్సిన పరిస్థితుల్లో అనుసరించిన నిర్ధారిత విధి విధానాలు ఎస్‌ఓపీ శ్రీ మందిరం సీఏఓ పర్యవేక్షించి ప్రభుత్వ అనుమతి కోసం సన్నాహాలు చేస్తారు. ఈ సన్నాహాలు ముగించి జూలై 9న జరిగే సమావేశంలో వివరాలను ప్రవేశపెడతారు.

మరమ్మతుల పరిశీలన

రత్న భాండాగారం లోపలి భాగాల మరమ్మతు పనుల వ్యవహారాన్ని కమిటీ పర్యవేక్షిస్తుంది. ఖజానాలో పదిలపరిచిన అమూల్య రత్న సంపదని ఖాళీ చేయడం మరో ప్రధాన కార్యాచరణగా పేర్కొన్నారు. దీనికోసం స్పష్టమైన నియమ నిబంధనలు రూపుదిద్దుకుంటాయి. ప్రధానంగా ఖజానా నుంచి బయటకు తీసిన ఆభరణాలు, నగలు వగైరా విలువైన వస్తువులను ఏ ప్రదేశానికి తరలించాలో ఆలయ పాలక మండలి నిర్ణయిస్తుంది.

ఆభరణాల జాబితా ప్రక్రియ

రత్న భాండాగారం తెరిచి ఆభరణాలు, నగలు ఇతరేతర విలువైన వస్తువుల జాబితాకు సంబంధించిన విధివిధానాలను (ఎస్‌ఓపీ) సిద్ధం చేసేందుకు మరో కమిటీని ఏర్పాటు చేస్తారు. చివరిసారి జాబితా తయారీకి 70 రోజులు పైబడి సమయం పట్టింది. కానీ ఈసారి అధునాతన సాంకేతికత అందుబాటులో ఉన్నందున చాలా త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. రథయాత్ర పురస్కరించుకుని గుండిచా మందిరానికి తరలి వెళ్లిన మూల విరాటులు తిరిగి శ్రీ మందిరం రత్న వేదికకు చేరే లోగా ఈ ప్రక్రియ ముగించే దిశలో కమిటీ సన్నాహాలు చేస్తుందన్నారు.

ఆభరణాల విశిష్టత కీలకమే

శ్రీజగన్నాథుని రత్న భాండాగారంలో తరతరాలుగా పదిలపరచి ఉన్న అమూల్య రత్న సంపద పూర్వాపరాలను తనిఖీ పర్యవేక్షక కమిటీ ఖరారు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆభరణాలు, నగల పూర్వాపరాలు నిర్ధారించగలిగే అనుభవజ్ఞులైన స్వర్ణకారుల కోసం ప్రయత్నిస్తారు. ఈ ప్రతిపాదనని కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. ప్రభుత్వం ఖరారు చేసిన స్వర్ణకారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పనులు చేపడతారు. గతంలో చెన్నై, హైదరాబాదు నుంచి స్వర్ణకారుల్ని రప్పించినట్లు సమాచారంగా పేర్కొన్నారు.

ఈనెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు



వివరాలు వెల్లడిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: కొత్తగా ఏర్పడిన 17వ రాష్ట్ర శాసన సభ తొలి సమావేశాలు జూలై 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ రఘుబర దాస్ ఆమోదం లభించినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం తెలిపారు. ఈసారి సమావేశాలు రెండు విడతల్లో జరుగుతాయి. రాష్ట్రంలో తొలిసారి ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను జూలై 25న సమర్పించనుంది. ఇది బీజేపీ ప్రభుత్వ తొలి బడ్జెట్ కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. శాసనసభ సచివాలయం జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఈనెల 22న సమావేశాల ప్రారంభంలో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ప్రసంగిస్తారు. ఆ రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతారు. మర్నాడు 23న ఉప వాచస్పతి ఎన్నికకు సంబంధించి ప్రకటన వెలువడనుంది. ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఈ పదవి కోసం నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తే 24వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారు. ఈనెల 25వ తేదీన ఆర్థిక శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆగస్టు 1 నుంచి 19 వరకు సభా కార్యక్రమాలకు తెర దించుతారు. ఈ సమయంలో వివిధ కమిటీలు, సభ్యులు బడ్జెట్‌ను బేరీజు వేసుకుంటారు. తిరిగి ఆగస్టు 20 నుండి శాసనసభ మలి విడత సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సమావేశాలు సెప్టెంబర్ 13 వరకు కొనసాగుతాయి. సెప్టెంబర్ 10న వ్యయ మంజూరు బిల్లు ఆమోదం కోసం సభలో ప్రవేశ పెడతారు.

సెంచూరియన్‌లో 'జునోసిస్ డే'



పెంపుడు కుక్కల సంరక్షణపై కరపత్రం విడుదల చేస్తున్న సెంచూరియన్ వర్సిటీ అధికారులు



పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లోని ఓపెన్ ఆడిటోరియంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య డీఎస్‌రావు మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలకు సాధారణంగా వచ్చే జునోటిక్ వ్యాధులను నియంత్రించడంలో సాధించిన పురోగతి, వాటి ప్రాముఖ్యతను చాటి చెప్పడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఐకార్-సిఫా (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్) ప్రొ.ప్రియబ్రతా స్వయిని పెంపుడు జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్‌లో 32 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. అనంతరం పెంపుడు కుక్కల సంరక్షణపై అవగాహనకు కరపత్రం విడుదల చేశారు. అంతకుముందు వెటర్నరీ స్కూల్ అండ్ సైన్సెస్ డీన్ రాజేంద్ర కుమార్ స్వయిని, అగ్రికల్చర్ కళాశాల డీన్ ప్రొ.ఎస్పీ నందా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రోలను సత్కరించారు.

• శౌర్యచక్ర ప్రదానం



ఒడిశాకు చెందిన లెఫ్టినెంట్ బిమల్ రంజన్ బెహెరాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ప్రతిష్ఠాత్మక పురస్కారం శౌర్య చక్రను ప్రదానం చేశారు. సముద్రంలో ఆపరేషనల్ ఎమర్జెన్సీలో నిర్భయ ఆపరేషన్ చేసినందుకు ఒడియా అధికారిని గౌరవనీయమైన అవార్డుకు సిఫార్సు చేశారు. – భువనేశ్వర్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మల్కన్‌గిరి: స్వాభిమాన్ ఏరియాలో కొండపై మొక్కలు నాటుతున్న దృశ్యం



భువనేశ్వర్: శాసనసభ ప్రాంగణంలో మొక్క నాటుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కోర్టుల సముదాయంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి బాసుదేవ ఆచార్య



కొరాపుట్: సునాబెడాలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ ఛైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో



రాయగడ: మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సప్తగిరి, కద్రక, తదితరులు



రాయగడ: గొడుబల్లిలో మొక్కలు నాటుతున్న కాళీరాం మాఝి

రాష్ట్రానికి విచ్చేసిన రాష్ట్రపతి ముర్ము



గోపబంధు దాస్ వర్ధంతి సభలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తదితరులు

భువనేశ్వర్: రాష్ట్రంలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం సాయంత్రం భువనేశ్వర్ చేరుకున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెకు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ స్వాగతం పలికారు. ఉత్కళమణి పండిత్ గోపబంధు దాస్ 96వ వర్ధంతి సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి నేరుగా విమానాశ్రయం నుంచి నగరంలోని జయదేవ్ భవన్‌కు వెళ్లారు. ఆదివారం పూరీలో జరగనున్న శ్రీ జగన్నాథుని రథయాత్రలో పాల్గొంటారు.

• స్వామిసేవలో సీఎం మోహన్ చరణ్



జగతి నాథుని ఆగమనంపై అంతా అత్యంత ఉత్సాహంగా ఉన్నారు. శ్రీమందిరం సింహద్వారం ఆవరణ నుంచి యాత్రకు బయల్దేరిన స్వామి సోదరసోదరీ సమేతంగా గుండిచా మందిరం ఆవరణ శారదబలి ప్రాంగణానికి చేరుతాడు. స్వామికి స్వాగతం పలికేందుకు శనివారం ఈ ప్రాంగణం శుభ్రపరిచి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సేవలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్వయంగా పాల్గొని ఊడ్చి పరిశుభ్రపరిచారు. ఆయనతో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తదితరులు ఉన్నారు. – భువనేశ్వర్

సంపూర్ణత అభిజాన్‌తో మేలు

• కొరాపుట్ ఎమ్మెల్యే సప్తగిరి



పర్లాకిమిడి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే దాశరథి గొమాంగో



పర్లాకిమిడి: సంపూర్ణత అభిజాన్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



రాయగడ: ఏర్పాటు చేసిన స్టాల్స్



రాయగడ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా ప్రారంభించిన సంపూర్ణత అభిజాన్‌తో జిల్లాకు మేలు జరుగుతుందని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సంపూర్ణత అభిజాన్ కార్యక్రమాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఒడిశాలోని వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఇదివరకే కేబీకే పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసిందని, అయితే దాని ద్వారా ఆశించినంత అభివృద్ధి సాధించలేకపోయామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో సమన్వయం లోపించడమే దీనికి కారణమన్నారు. రాయగడ వంటి జిల్లా ఇప్పటికీ వెనుకబడిన జాబితాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం విచారకరమన్నారు. ఆ జాబితా నుంచి వైదొలగాలంటే అందుకు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించాలని పేర్కొన్నారు.

ఆరు అంశాలకు ప్రాధాన్యం

సంపూర్ణత అభిజాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా ఆరు అంశాలకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పించిందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ వివరించారు. విద్య, వైద్యం, భూసార సంరక్షణ, టీకాలు, పౌష్టికాహారం, గర్భస్థ శిశు సంరక్షణ వంటి ప్రధాన అంశాలపై దృష్టి కేంద్రీకరించడమే ప్రధాన సారాంశమని వెల్లడించారు. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం ఆకాంక్ష పథకం అమలు చేసి మంచి ఫలితాలను సాధించిందన్నారు. దీనిలో భాగంగా రాయగడ జిల్లా ఆకాంక్ష జిల్లాల్లో ఒకటిగా గుర్తింపు పొందడంతో గతేడాది ఈ పథకం మంచి ఫలితాలను ఇవ్వడంతో జిల్లాకు రూ.10 కోట్ల బహుమతి లభించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రారంభమైన సంపూర్ణత అభిజాన్ కూడా మంచి ఫలితాలను సాధిస్తుందని అకాంక్షించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక గజపతి కూడలి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పర్లాకిమిడిలో...

స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో లు సంపూర్ణ అభిజాన్‌ను ప్రారంభించారు. తొలుత కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అటల్ బిహారీ పార్క్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. సంపూర్ణత అభిజాన్ క్రింద 2030 నాటికి దేశంలో మౌలిక సౌకర్యాల కల్పన కొరత నిర్మూలిస్తామని నీతి ఆయోగ్ మంత్రిత్వ శాఖ యువ ప్రొఫెషనల్ నీతి ప్రకాష్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ కార్య నిర్వాహక అధికారి డా.గుణనిధి నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డీఎఫ్‌వో ఎస్.ఆనంద్, సబ్ కలెక్టర్ అనూప్ పండా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం


సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి స్నపనం, పంచామృతభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో జైన గురూజీ అమిరస మహరాజ్ మాతాజీ, ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం సీతారామయ్య, పద్మశ్రీ దంపతులు, పోరాం రామారావు, పట్నాయక్, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాలు జారీ

పార్వతీపురం టౌన్: ట్రాన్స్‌జెండర్లకు ధ్రువపత్రాల జారీకి చర్యలు చేపట్టామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె. కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హిజ్రాలకు కేటాయించిన సౌకర్యాలు, రాయితీలను పొందేందుకు వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సహాయం పొందాలనుకునే హిజ్రాలకు ధ్రువీకరణ తప్పనిసరన్నారు. పింఛను, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇతర ప్రయోజనాలు, వివిధ ప్రభుత్వ శాఖలు అందించే పథకాల ప్రయోజనాలను పొందడానికి వారికి ప్రత్యేక కార్డులు అందజేస్తామన్నారు. ఇప్పటివరకు ధ్రువపత్రాలు పొందని హిజ్రాలు నోటరీ అఫిడవిట్ చేయించుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొవచ్చునన్నారు. ఇతర వివరాలకు 95026 66688, 91334 63549 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల పాత్ర భేష్

విజయనగరం అర్బన్: పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర శ్లాఘనీయమని జిల్లా సహకార అధికారి పిల్లి రమేష్ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక డీసీసీబీ ప్రాంగణంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరైన నాయకత్వం ఉంటే సహకార సంఘాలు గణనీయమైన విజయాలు సాధిస్తాయని చెప్పారు. ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారం ప్రపంచ సహకార దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో సహకార సంఘాలు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని ఈ రోజు నిలదొక్కుకున్నాయని చెప్పారు. జనాభాలో ప్రతి ఆరుగురిలో ఒకరు సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. సహకారం వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి సహకార సంఘ సభ్యుడు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి టి.నాగార్జున, డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈఓ చిప్పాడ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్ కేవీవీ సత్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా..


మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజు ప్రాతినిధ్యం వహించిన విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం జిల్లాకు విచ్చేసిన ఎంపీకి టీడీపీ, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం అశోక్‌బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి తగినన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబు, పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అశోక్ అడుగుజాడల్లో పయనిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు అదితిగజపతిరాజు, లోకం మాధవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యువల్ చేసుకోవాలి

చీపురుపల్లి: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు 2024-25 విద్యా సంవత్సరంలో కొనసాగేందుకు రెన్యువల్ చేసుకోవాలని ఐడీ కళాశాల, ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలోని ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యువల్ కోసం దరఖాస్తులను వారు విధులు నిర్వర్తిస్తున్న కళాశాలల్లోని ప్రిన్సిపాళ్లకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

రైతన్న దగా..

- ఓ వైపు వర్షాభావం..మరో వైపు నకిలీ విత్తనాలు, పురుగు మందులు
- పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా తనిఖీలు


ఈ నెల ఒకటో తేదీన రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ వెంకటయ్య(ఫైల్)


తనిఖీ అనంతరం పురుగుమందుల దుకాణ యజమానిపై రిపోర్ట్ రాస్తున్న విజిలెన్స్ అధికారులు

రామభద్రపురం : ఒక వైపు వర్షభావం.. మరోవైపు తెగుళ్లు, చీడపీడలు.. ఇంకోవైపు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగంతో రైతన్న దగాపడుతున్నాడు. ఇంత నష్టపోతున్నా రైతన్నను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మంది సన్న, చిన్నకారు రైతులున్నారు. వీరికి ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో ఇవ్వాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇవ్వడం లేదు. ఇదే సమయంలో వ్యాపారులు అత్యాశకు పోయి నకిలీలను అంటగడుతున్నారు. కాలం చెల్లిన క్రిమిసంహారక మందులు, నాసిరకం ఎరువులను రైతులకు అధిక ధరలకు అంటగడుతున్న వ్యాపారులను అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఫలితంగా అన్నదాత అటు ప్రకృతి ప్రకోపాలకు, ఇటు వ్యాపారుల మోసాలకు బలవుతున్నాడు. కనీస ప్రమాణాలు పాటించకుండా కొంత మంది దుకాణాదారులు పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నారు. ఏ విధమైన అనుమతులు, రికార్డులు, అధికారుల సర్టిఫికెట్లు లేకుండా, స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేయకుండా బయో కంపెనీలకు చెందిన పురుగుమందులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్లు రామభద్రపురం మండలంలో ఈనెల 5న విజిలెన్స్, వ్యవసాయాధికారులు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. అలాగే నాసిరకం పురుగు మందులు, ప్రభుత్వం నిషేధించినవే కాకుండా కాలంచెల్లిన 10జీ, 3జీ గుళికలు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక నిర్ధారణలో తేల్చారు.

జేసీ కోర్టుకు అప్పగిస్తాం..

తాము ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడంతో పాటు దుకాణ యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. నిషేధిత మందులు, నాసిరకం విత్తనాలు, పురుగు మందులు విక్రయించకూడదని హెచ్చరిస్తున్నాను. ఈ నెల ఒకటో తేదీన మండల కేంద్రంలోని ఓ దుకాణాన్ని తనిఖీ చేశాను. పురుగు మందులు శాంపిల్స్ కూడా తీసుకున్నాను. అలాగే విజిలెన్స్ అధికారులు గుర్తించిన మందులు, విత్తనాలలో శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నాను. యజమానిని హెచ్చరిస్తూ స్టాప్ సేల్‌కు ఆదేశించాం. ఈ కేసును జేసీ కోర్టుకు అప్పగిస్తున్నాం.

– వెంకటయ్య, ఏఓ, రామభద్రపురం

అదును చూసి అమ్మేస్తున్నారు...

ప్రస్తుతం వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయల పంటల్లో తెగుళ్లు, చీడపీడలను నివారించాలనే ఉద్దేశంతో ప్రతి రైతూ పైర్లకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు వారికి నాసిరకం ఎరువులు, కాలం చెల్లిన క్రిమిసంహారక మందులు అంటగడుతున్నారు. రూ.150 నుంచి 200 రూపాయల విలువ చేసే మందులను రూ. 300 నుంచి రూ.400 వరకు విక్రయించేస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీల మందులు ఇవ్వకుండా బయో కంపెనీల మందులు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నాసిరకం మందులు పిచికారీ చేయడం వల్ల తెగుళ్ల బెడద తొలగడం లేదని, ఒకటికి రెండుసార్లు మందులు పిచికారీ చేయడం వల్ల ఆర్థిక భారం పడుతోందని అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ వారికి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

అధికారుల తనిఖీలు..

మండల కేంద్రంలోని ఓ పెస్టిసైడ్ దుకాణాన్ని ఈ నెల ఒకటో తేదీన మండల వ్యవసాయాధికారి తనిఖీ చేశారు. అప్పుడు ఎటువంటి లోటుపాట్లు బయటపడలేదు. ఇంతలో ఐదో తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్. తాతారావు, ఏలూరు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ ఎ.డి ఆర్. గంగాధరరావు ఐదో తేదీన అదే దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఆ దుకాణంలో ప్రభుత్వం నిషేధించిన మందులు, నాసిరకం మందులు, అనుమతుల్లేని మందులు బయటపడ్డాయి. దీంతో అధికారులు యజమానిపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

టోల్‌గేట్ ఎత్తివేయాలి

- తీర్మానం చేసిన సభ్యులు
- ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కాపుగంటి ప్రకాష్

విజయనగరం : కాంట్రాక్టర్ల స్వలాభం కోసం వేలాది మంది ప్రజలపై భారం మోపే విధంగా గెడ్డపేట వద్ద నిర్మించిన అక్రమ టోల్‌గేట్ తక్షణం ఎత్తివేయాలని ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ డిమాండ్ చేశారు. సుమారు 20 సంస్థలు సభ్యులుగా ఉన్న ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం ఆధ్వర్యంలో ఉల్లివీధిలో గల చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కొత్తగా నిర్మించిన హైవేల నిర్వహణ కోసం టోల్ ఫీ వసూలు చేయడం జరుగుతుందని, అయితే డెంకాడ మండలం పరిధిలో గల గెడ్డపేట వద్ద ఎటువంటి కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టకుండా, కేవలం ఉన్న రోడ్‌ను కొంతమేర వెడల్పు చేసి అక్కడ అక్రమంగా టోల్‌గేట్ ఏర్పాటు చేయడం అన్యాయం అని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లి వారి సహకారంతో టోల్‌గేట్ ఎత్తివేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. చెల్లూరు నుంచి నిర్మించిన కొత్త హైవేరోడ్ మీద టోల్ గేట్ ఉంటే ఎటువంటి అభ్యంతరం ఉండదు కాని... గెడ్డపేట దగ్గర ఏర్పాటు చేయడం నిరంకుశ ధోరణి అని హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. విజయనగరం నుంచి విశాఖపట్నానికి విద్య, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారని, అటువంటి వారందరూ టోల్‌గేట్ వల్ల ఇబ్బంది పడుతున్నారని రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ పూర్వ అధ్యక్షుడు శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కౌముది పరిషత్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోస్, హోల్‌సేల్ వర్తక సంఘం ప్రతినిధి వి.సతీష్‌కుమార్, తదితరులు మాట్లాడుతూ, టోల్‌గేట్ వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు రవ్వ శ్రీనివాస్, సూర్యలక్ష్మి, కేఆర్‌కే రాజు, కాపుగంటి రవి, అలవెల్లి శేఖర్, శిరీష, కల్పన, దాసరి సుకుమార్, కట్టమూరి ప్రభాకర్, గుడిశా శ్రీనివాస్, గౌరీశంకర్, అచ్చిరెడ్డి, మల్లేశ్వరరావు, బొడ్డు రమేష్, ఇతర సభులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై నిఘా..

- పోలీసుల దాడిలో పట్టుబడిన ఐదు ట్రాక్టర్లు, జేసీబీ


తవ్వకాలు జరిపిన చెరువు


రాత్రివేళ జేసీబీతో ట్రాక్టర్‌లోకి కంకరను నింపుతున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. చెరువులను నాశనం చేస్తూ కంకర (గ్రావెల్) తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని దిబ్బగుడ్డివలస సమీపంలో శుక్రవారం రాత్రి సుమారు 10 ట్రాక్టర్లు, ఒక జేసీబీతో పట్టణంలోని ఓ రియల్ ఎస్టేట్ స్థలానికి కంకరను తరలిస్తున్నారు. దీన్ని గమనించిన గ్రామస్తులు ఉన్నతాధికారులు, విలేకరులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. గ్రామంలోని చెరువులో గతంలో కూడా కంకర తవ్వకాలు చేపట్టి దాని స్వరూపం మార్చేశారని, మళ్లీ తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉంటే విషయం తెలుసుకున్న ఆర్డీఓ గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకోగా అప్పటికే ఐదు ట్రాక్టర్లు రహస్య ప్రాంతానికి తరలించగా.. మిగిలిన ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్లను విచారిస్తున్నారు. తవ్వకాల వెనుకున్న సూత్రదారుల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్ త్రినాథరావునాయుడు మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ యంత్ర పరికరాలు స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్ట్


యంత్రాలతో పట్టుబడిన నిందితులతో పోలీసులు

గజపతినగరం : మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన మనిపూరి గోవింద, జిన్నాం గ్రామానికి చెందిన యిజ్జిరోతు సత్యనారాయణలకు చెందిన వ్యవసాయ యంత్ర పరికరాలను ఇటీవల దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే దొంగలు తాము అపహరించి పరికరాలను బొలేరో వాహనంలో తరలిస్తుండగా.. మండల కేంద్రంలోని పైడితల్లి కోవెల వద్ద ఎస్సై యు. మహేష్, సిబ్బంది కలిసి శనివారం పట్టుకున్నారు. ఈ మేరకు నిందితులను గుర్ల మండలం లవిడాం గ్రామానికి చెందిన మీసాల గోవింద (25), గొర్లె నరేంద్ర (23), కొంకి పైడిరాజు, మెరకముడిదాం మండలం బైరిపురానికి చెందిన కోండ్రోతు గౌరినాయుడు (40)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, నిందితులపై బుదరాయివలస, గరివిడి, గుర్ల పోలీస్ స్టేషన్‌లలో కూడా పలు కేసులున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు, దామోదర్, సత్యనారాయణ, రామకృష్ణ, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాజాం సిటీ: మండలంలోని పరశురాంపేటకు చెందిన వృద్ధుడు బెవర అప్పలనాయుడు (73) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల రెండో తేదీన అప్పలనాయుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి, రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన తర్వాత పడుకోగా.. తెల్లవారుజామున వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆర్ఎంపీని పిలవగా.. తాను పురుగు మందు తాగేశానని అప్పలనాయుడు చెప్పాడు. దీంతో అతడ్ని స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై అల్లు లక్ష్మునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


పార్వతి మృతదేహం

చీపురుపల్లి: మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన బొమ్మిరోతు పార్వతి (38) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై కె. కిరణ్‌కుమార్‌నాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విశాఖలోని పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన పార్వతి ఈ నెల ఒకటో తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను విజయనగరంలోని మహరాజా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూసింది. మృతురాలి తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

నేడు బయాలజీ ఫోరం సదస్సు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న జీవశాస్త్ర సహాయకులతో జిల్లా జీవశాస్త్ర చర్చావేదిక ఆదివారం నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ నాయకుడు బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురంలోని బ్రాంచ్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి జిల్లాలో పనిచేస్తున్న జీవశాస్త్ర సహాయకులందరూ హాజరుకావాలని కోరారు. అలాగే పాఠశాల సిలబస్‌పై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ఫోరంను ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చీపురుపల్లి: మండలంలోని సంకుపాలెం జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... బాధిత మహిళలు ద్విచక్ర వాహనంపై చీపురుపల్లి వైపు నుంచి లావేరు వైపు వెళ్తున్నారు. సంకుపాలెం జంక్షన్ వద్ద పాల వ్యాన్‌ను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం బోల్తాపడింది. దీంతో చీపురుపల్లికి చెందిన ఎం.కామేశ్వరికు కుడి కాలు విరిగిపోగా, కొత్తపేటకు చెందిన పి.ఆదిలక్ష్మి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులకు చీపురుపల్లి సీహెచ్‌సీలో చికిత్స అందజేశారు. ఇదే విషయమై ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ, ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదన్నారు..

8 నుంచి ఉచితంగాఇసుక సరఫరా

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇసుక వినియోగదారులకు ఈ నెల 8వ తేదీ నుంచి ఉచితంగా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఇసుక సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇసుకను తీసుకొచ్చి కొత్తవలస, డెంకాడ మండలం పెద తాడివాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతాల్లోని స్టాక్ యార్డులలో నిల్వచేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం 92 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులకు కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 20 టన్నులకు మించకుండా సరఫరా చేస్తామని తెలిపారు. టన్నుకు రూ.605 చొప్పున ఇసుక హ్యాండ్లింగ్ చార్జీలు వసూలు చేస్తామని తెలిపారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు


సదస్సులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్, తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో రెండు రోజులుగా నిర్వహించిన 'ఏఐ-పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ' అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. రెండో రోజు సదస్సులో యూఎస్‌ఏకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా, షార్లెట్ ప్రొఫెసర్ మిలింద్ ఖిరే, తెలంగాణా ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్‌లు ఆన్‌లైన్‌లో తమ సందేశాన్ని అందించారు. వ్యర్థ పదార్థాల ద్వారా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా విద్యార్థులు ప్రయోగాలు చేయాలని, తమకు అందిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మిలింద్ ఖిరే వివరించారు. పర్యావరణ ఉద్గారాలను లెక్కించేందుకు సెన్సార్ ఆధారిత పద్ధతులు అవసరమని తెలిపారు. భూగర్భజలాల నష్టాలను పూడ్చడంతో పాటు నీటి పునర్వినియోగానికి తోడ్పడే అంశాలను విశదీకరించారు. ఇళ్ల పైకప్పుగా పచ్చని పైకప్పు వాడకం అవసరమని వివరించారు. పర్యావరణ అంశాలపై పరిశోధనల కోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వాడుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ దీపక్ గార్గ్ ప్రసంగిస్తూ మానవులపై ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చాలా ప్రభావాన్ని చూపుతుందని, మానవుల కోసం తనే నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. నెట్‌ఫిక్స్, గూగుల్ మ్యాప్స్, మ్యాట్రిమోనీ తదితర సైట్స్ ఉన్నాయని తెలిపారు. ఈ రోజు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తనకు తానుగా కొత్త ఆవిష్కరణలు చేసే స్థాయికి వెళ్లిందని, ప్రభుత్వం కూడా అన్ని రంగాల్లో ఏఐని ఉపయోగించుకుంటుందని పేర్కొన్నారు. ఏఐ ప్రభావం విద్యార్థులపై ఎక్కువగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్ వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. వారు ఆ ప్రవాహంలో కొట్టుకుపోకుండా వారికి వాస్తవాలు అర్థం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో 136 పరిశోధనా పత్రాలను ఆయా పరిశోధకులు ప్రదర్శించగా వాటిపై సుదీర్ఘ చర్చలు జరిగినట్టు వెల్లడించారు. అనంతరం పరిశోధనా పత్రాలను సమర్పించిన పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, సదస్సు కన్వీనర్లు డాక్టర్ కె.రవీంద్రనాథ్, డాక్టర్ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' పనులు ప్రారంభించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

విజయనగరం ఫూల్‌బాగ్: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య కోరారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అమర్‌భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యానికి ఉత్తరాంధ్ర వెనుకబాటుతనమే ఒక నిదర్శనమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో వేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీతో పాటు అనేక కమిటీలు ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత వెనుకబాటు ప్రాంతంగా ఉత్తరాంధ్రను గుర్తించాయని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా పాలకుల అనుసరిస్తున్న విధానాల వల్ల అదే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే వ్యవసాయానికి సాగునీరు అందించాలని అభిప్రాయపడ్డారు. గోదావరి నుంచి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. అనంతరం సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర సహాయ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ.. గోదావరి నదిపై పోలవరం వద్ద ప్రారంభించబడిన బహుళార్థక ప్రాజెక్ట్ నుంచి ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖపట్నంలోని 3.21లక్షల ఎకరాలకు.. విజయనగరంలోని 3.94 లక్షల ఎకరాలకు.. శ్రీకాకుళం జిల్లాలోని 85 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. స్థానిక నాయకులు ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి సాగు, తాగునీటిని సాధించాలని కోరారు. కార్యక్రమంలో సోనాపురం కిరణ్‌కుమార్, అప్పలరాజు, గర్భాన సత్తిబాబు, కనతార చౌదరినాయుడు, చేబోదుల లక్ష్మీనారాయణ, వండాన కూర్మారావు, తాత్రాజు రాజారావు, ఎజ్జిపురపు శ్రీనివాస్, బొబ్బిలి, సాలూరు, విజయనగరం, నెలిమర్ల, చీపురుపల్లి, రాజాం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాలకొండ నియోజకవర్గాల నుంచి వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పశువుల కబేళాపై పోలీసుల దాడి

- 43 పశువులకు విముక్తి
- రెండు వాహనాలు సీజ్, అదుపులో ముగ్గురు నిందితులు


పోలీసులు విముక్తి కల్పించిన పశువులు

విజయనగరం క్రైమ్: కంటోన్మెంట్ ప్రాంతంలోని కబేళాకు పశువులను తరలిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్పీ దీపిక ఆదేశాలతో వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 43 పశువులకు విముక్తి కల్పించడంతో పాటు రెండు వాహనాలను సీజ్ చేశారు. వాహన డ్రైవర్లు సురేష్, పత్రి శంకరరావుతో పాటు వ్యాపారి అబ్దుల్ బషీని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్, ఎస్సై నరేష్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సాగర్‌బాబు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యశిక్షణ


నైపుణ్య శిక్షణ ప్రగతి నివేదికను పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. నిరుద్యోగ యువతకు త్వరలో భారీ ఎత్తున ఉపాధి శిక్షణ కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. విజయనగరం వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో టీటీడీసీ స్కిల్ కాలేజ్‌ను ఎమ్మెల్యే అదితిగజపతిరాజుతో కలిసి శనివారం ఉదయం సందర్శించారు. తరగతి గదులు, వసతులను పరిశీలించారు. సీడాప్ ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణ, ఉపాధి కల్పనను డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి మంత్రికి వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ-జీకేవై) పథకం కింద ఇస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. టీఆర్టీసీ స్కిల్ కాలేజ్, విశ్వ సముద్ర, మిలీనియం, చైతన్య భారతి, ఎల్‌జీఎంఎం తదితర సంస్థల ద్వారా ఇస్తున్న శిక్షణ, కోర్సులు, ఉపాధి అంశాలపై ఆరా తీశారు. ఏడాదికి సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తుండడంపై మంత్రి అభినందించారు. ప్రాంగణంలోని ఎస్‌బీఐ గ్రామీణ యువత ఉపాధి శిక్షణ సంస్థను, బొకే మొక్కల విక్రయ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. బొకేల తయారీ, విత్తనాల సేకరణ, కుండీలు, మొక్కల పెంపకం తదితర అంశాలపై మంత్రి ప్రశ్నించారు. ఆకుకూర విత్తనాలను మంత్రి జల్లారు. దుస్తుల తయారీ సెంటర్‌ను పరిశీలించారు. జిల్లా సమాఖ్య కేంద్రాన్ని, చంద్రన్న బీమా సెంటర్‌ను సందర్శించారు. సమాఖ్య కార్యకలాపాలను జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఇతర అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్‌లోని డిమాండ్‌కు అనుగుణంగా సరికొత్త కోర్సులతో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. విజయనగరం జిల్లా ఫార్మా, విశాఖ జిల్లాలో హోటల్ పరిశ్రమల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటికి అనుగుణంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. పర్యటనలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, ఏపీడీ సావిత్రి, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, జిల్లా నైపుణ్య అధికారి గోవిందరావు, జేడీఎం జామ్స్ మారి స్‌లూథర్, సిబ్బంది పాల్గొన్నారు.